క్లుప్తంగా

రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలి

కురిచేడు: రైతులు అవసరానికి మించి రసాయనిక ఎరువులు వాడితే ఖర్చు పెరుగుతుందని ఏఓ సంపత్‌కుమార్ పేర్కొన్నారు. పురుగులు, తెగుళ్లు ఎక్కువగా వచ్చి దిగుబడి తగ్గడంతో పాటు నేలలు నిస్సారమైపోతున్నాయని చెప్పారు. కురిచేడులో సాగు చేసిన కంది, పొగాకు పంటలను ఆయన మంగళవారం పరిశీలించారు. ప్రస్తుతం కంది పంటలో ఆకు చుట్టు పురుగును గమనించామని, దీని నివారణకు క్లోరీపైరీఫాస్ 2.5 మిలీ లేదా క్వినాల్ ఫాస్ 2 మిలీ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని చెప్పారు. ముందు జాగ్రత్త చర్యగా కంది విత్తిన 35 రోజుల నుంచి 40 రోజులప్పుడు నీటిలో కరిగే గంధకం 3 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేస్తే వెర్రి తెగులును వ్యాప్తి చేసే ఇరియోఫిడ్ నల్లని నివారించవచ్చని వివరించారు. ప్రతి రైతు తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని తెలిపారు. వ్యవసాయ విస్తరణాధికారి రవికాంత్, ఉద్యానవన సహాయకురాలు మేరి పాల్గొన్నారు.

అక్షరాస్యులను చేసేందుకే అక్షరాంధ్ర



వలంటీర్లకు శిక్షణ ఇస్తున్న అధికారులు

త్రిపురాంతకం: అక్షరాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేసి నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని ఎంపీడీఓ రాజ్‌కుమార్, ఎంఈఓ కె.తులసి మల్లికార్జున నాయక్ పేర్కొన్నారు. అక్షరాంధ్ర కార్యక్రమంలో భాగంగా వలంటీర్లకు మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఏపీఎం ఎడ్వర్డ్ మాట్లాడుతూ మండలంలో మొదట విడతగా 4,363 మందిని అక్షరాస్యులుగా మార్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. వీరికి రాత్రి సమయంలో తరగతులు నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు.

తాగునీటి ఎద్దడి

- గిరిజన గూడేల్లో పని చేయని మంచినీటి పథకాలు
- నిరుపయోగంగా మారిన ఓవర్ హెడ్ ట్యాంకులు
- మరమ్మతులకు గురై ఉపయోగంలో లేని చేతి పంపులు

పెద్దదోర్నాల: నల్లమల అటవీ ప్రాంతం పరిధిలో నివాసం ఉంటున్న చెంచు గిరిజనులు మంచినీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆయా గూడేల్లో ఏర్పాటు చేసిన మంచినీటి పథకాలు పని చేయక పోవడంతో పాటు గూడేల్లో వేసిన చేతి పంపులు అధిక శాతం మరమ్మతులకు గురయ్యాయి. దీంతో తాగునీటి నీటి సమస్య తీవ్రతరమైంది. నల్లమల అభయారణ్యంలోని పలు గూడేల్లో దట్టమైన అడవుల మీదగా ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్లు తరుచూ మరమ్మతులకు గురవుతుండటంతో ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన నీటి పథకాలు పని చేయడం లేదు. దీంతో యర్రగొండపాలెం నియోజకవర్గ పరిధిలో నివసిస్తున్న చెంచు గిరిజనులు నీటి కోసం



నిరుపయోగంగా మారిన ట్యాంకు



ఉపయోగంలో ఉన్న ఒకే ఒక మంచినీటి ట్యాంక్



ట్యాంకు వద్ద కుళాయి పగలడంతో ఇబ్బంది పడుతున్న గిరిజన మహిళ

తీవ్ర అవస్థలు ఎదుర్కొవాల్సిన పరిస్థితి నెలకొంది. మండల పరిధిలోని తుమ్మలబైలు గిరిజన గూడెంలో ఏర్పాటు చేసిన చేతి పంపులు సైతం పనిచేయక పోవడంతో గూడేల్లోని సుదూర ప్రాంతాల నుంచి నీరు తెచ్చుకోవాల్సి పరిస్థితి ఏర్పడిందని గిరిజనులు వాపోతున్నారు. మండల పరిధిలోని పలు గూడేల్లో ఈ పరిస్థితి నెలకొన్నా గిరిజనుల దాహార్తి తీర్చేందుకు అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం వారిలో ఆగ్రహాన్ని కలగజేస్తోంది. కొన్ని నెలలుగా పలు గూడేల్లోని చేతి పంపులు మరమ్మతులకు గురైనా అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవని గిరిజనులు ఆరోపిస్తున్నారు. నియోజకవర్గంలోని పలు గిరిజన గూడేల్లో మంచి నీటి పథకాలతో పాటు చేతిపంపులు సైతం పనిచేయక ఆయా గూడేల వాసులు సమీప ప్రాంతాల్లోని కుంటలు, వ్యవసాయ బోర్లపై ఆధారపడాల్సి వచ్చింది.

ట్యాంకులు నిరుపయోగంగా ఉన్నాయి:



గూడెంలో ఉన్న ఓ ఓవర్ హెడ్ ట్యాంకుతో పాటు రెండు నేల బారు ట్యాంకులు నిరుపయోగంగా మారాయి. చేతి పంపులు మరమ్మతులకు గురైనా వాటిని బాగు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. అధికారులకు ఎన్ని సార్లు మొర పెట్టుకున్నా పట్టించుకున్న వారే లేరు. గూడెంలో సుదూరంగా ఉన్న ఒకే ఒక్క డీప్ బోర్, ట్యాంక్‌పై ఆధారపడాల్సి వస్తోంది. ట్యాంకుకు సంబంధించిన కుళాయి కూడా పనిచేయక పోవడంతో దాని స్థానంలో కర్రలు అడ్డుగా పెట్టి నీరు పట్టుకుంటున్నాం.

కుడుముల గురవమ్మ, తుమ్మలబైలు గిరిజన గూడెం

కరెంటు ఇబ్బందులు ఉన్నాయి:



పలు గిరిజన గూడేల్లో మంచి నీటి పథకాలు పనిచేయడం లేదు. దీనికి తోడు నల్లమల అభయారణ్యంలోని అడవుల నుంచి వేసిన విద్యుత్ లైన్లు తరుచూ మరమ్మతులకు గురవుతున్నాయి. ఫలితంగా గూడేల్లో కరెంటు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీంతో నీటి సమస్యలు అధికంగా ఉన్నాయి. చేతి పంపులు ఎక్కువగా మరమ్మతులకు గురై ఉన్నాయి. వాటిని బాగు చేయమని ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

భూమని అంకమ్మ, తుమ్మలబైలు గిరిజన గూడెం

కాలం తీరిన వంతెనలతో కష్టాలు



ప్రగళ్లపాడు సమీపంలో శిథిలావస్థకు చేరిన తీగలేరు బ్రిడ్జి



రామాయపాలెం సమీపంలో బ్రిడ్జిపై ఏర్పడిన గుంత

పెద్దారవీడు: మండల పరిధిలోని పలు గ్రామాలకు అనుసంధానంగా తీగలేరుపై నిర్మించిన వంతెనలు శిథిలావస్థకు చేరాయి. దీంతో నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే వంతెనలపై వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రగళ్లపాడు నుంచి ఏనుగులదిన్నెపాడు, రామాయపాలెం నుంచి బద్వీడుచెర్లోపల్లి గ్రామాల మధ్యలో ఉన్న తీగలేరు వంతెనలు బలహీనంగా ఉండటంతో ఏ క్షణంలోనైనా ప్రమాదం జరగవచ్చని వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. ప్రగళ్లపాడు తీగలేరు వంతెన మీదుగా ఏనుగుదిన్నెపాడు, చట్లమిట్ల, కర్రోల, పోతంపల్లి, రేగుమానిపల్లి, రాజంపల్లి తదితరల గ్రామాలు, రామాయపాలెం తీగలేరు వంతెన మీదుగా సానికవరం, చాట్లమడ అగ్రహారం, మద్దలకట్ట, తమ్మడపల్లి, చిన్నగుడిపాడు, బోమ్మలాపురం గ్రామాల ప్రజలు నిత్యం పెద్దారవీడు, మార్కాపురం రాకపోకలు సాగిస్తుంటారు. ఈ వంతెనలపై ఆటోలు, ట్రాక్టర్లు, ఆర్టీసీ బస్సులు, కార్లు, ద్విచక్ర వాహనాలు తిరుగుతుంటాయి. రాకపోకలు సాగాలంటే కష్టాలు తప్పడం లేదని వాహనదారులు వాపోతున్నారు. ఈ వంతెనల మీదుగానే రైతులు పొలాలకు వెళ్తుంటారు. శిథిలావస్థలో ఉన్న వంతెనల స్థానంలో నూతన వంతెనలు నిర్మించాలని పలుమార్లు అధికారులకు చెప్పినా పట్టించుకున్న పాపాన పోలేదని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత్యంతర లేక వంతెనలపై ప్రయాణం చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ప్రజలు, ప్రయాణికులు, వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయంలో వంతెనలకు రక్షణ గోడలు లేకపోవడంతో గుంతలు కనిపించక ఎక్కువగా ప్రమాదాలు సంభవిస్తున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు రేడియం స్టిక్కరింగ్‌తో హెచ్చరిక బోర్డులన్నా ఏర్పాటు చేయకపోవడంపై వాహనదారులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకముందే శిథిలావస్థకు చేరిన వంతెనల స్థానంలో నూతన వంతెనలు నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పరిశ్రమలు నిర్మించి ఉపాధి కల్పించాలి



ప్రజలతో మాట్లాడుతున్న నాయకులు

దొనకొండ: దొనకొండ ప్రాంతంలో పారిశ్రామిక కారిడార్‌ను ఏర్పాటు చేసి ఈ ప్రాంత ప్రజలకు ఉపాధి కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘాల జిల్లా కార్యదర్శులు పమిడి వెంకట్రావు, కంకణాల ఆంజనేయులు డిమాండ్ చేశారు. మంగళవారం పారిశ్రామిక కారిడార్ ప్రాంతంలో సంఘ నాయకులతో కలిసి వారు పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర విభజన సందర్భంగా దొనకొండ రాజధానిగా ఏర్పడుతుందని, తద్వారా వెనుకబడిన ప్రాంతాల్లో ప్రజలకు ఉపాధి కల్పిస్తారని ప్రజలు ఆశించారని గుర్తు చేశారు. 2014లో ఆనాటి టీడీపీ ప్రభుత్వం దొనకొండ రాజధాని విషయాన్ని విస్మరించిందని మండిపడ్డారు. పదేళ్లు గడిచినా ఈ ప్రాంతంలో ఒక్క పరిశ్రమ కూడా రాలేదని, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధిపై పాలకుల చిత్తశుద్ధికి ఇది నిదర్శనమన్నారు. దొనకొండకు 10 కిమీ దూరంలోని రుద్రసముద్ర పరిధిలో సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం, అధికారులు ప్రకటనలకే పరిమితమయ్యారన్నారు. 2015లో మండలంలోని 21 గ్రామాల పరిధిలో సుమారు 25 వేల ఎకరాలు సేకరించి దొనకొండ మెగా ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటు చేస్తామని ప్రకటించి ప్రజలకు ఆశలు కల్పించారని ధ్వజమెత్తారు. 2018లో 4 గ్రామాలకు సంబంధించి సుమారు 2400 ఎకరాలు ఏపీఐఐసీకి అప్పగించారని నాయకులు గుర్తు చస్తశారు. ఈ అంశాలన్నీ ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని పరిశ్రమలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి వారు విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా నాయకులు గుమ్మా బాలనాగయ్య, సీఐటీయూ దొనకొండ కార్యదర్శి చిరుపల్లి అంజయ్య, వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు కుందుర్తి చిన్న నరసింహులు, కె.రామయ్య పాల్గొన్నారు.

జగనన్న పాలన మళ్లీ రావాలి



నాగంబొట్లపాలెంలో క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

తాళ్లూరు: కూటమి ప్రభుత్వ అరాచక పాలనపోయి జగనన్న పాలన కోసం ప్రజలు ఎదురు చూస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తూము సుబ్బారెడ్డి, సర్పంచ్‌లు ముచ్చుమారి బ్రహ్మారెడ్డి, చిమట సుబ్బారావు, బాపిరెడ్డి నాగిరెడ్డి అన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని వెలుగువారిపాలెం, నాగంబొట్లపాలెం, రామభద్రపురం గ్రామాల్లో మంగళవారం బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల నాయకులు మాట్లాడుతూ కూటమి అరాచక పాలనకు అడ్డుకట్ట వెయ్యాలని పిలుపునిచ్చారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేసి 2029 ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని గెలిపించుకోవాలని కోరారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పేదలకు అన్ని విధాలా అండగా ఉందని గుర్తు చేశారు. మండల ఉపాధ్యక్షుడు పులి ప్రసాద్‌రెడ్డి, రాష్ట్ర మాజీ సంయుక్త కార్యదర్శి ఐవీ సుబ్బారెడ్డి, సర్పంచ్‌ల సంఘ జిల్లా అధ్యక్షుడు మారం ఇంద్రసేనారెడ్డి, నియోజవర్గ ప్రచార, సాంస్కృతిక విభాగం అధ్యక్షులు జక్కుల రామకృష్ణ, యత్తపు మధుసూదన్‌రెడ్డి, వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు షేక్ లతీఫ్ (బచ్చా), పులి రమణారెడ్డి, యామర్తి ప్రభుదాస్, సర్పంచ్‌లు షేక్ వలి, ఎంపీటీసీ సభ్యులు మూలం వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, మండల నాయకలు కటకంశెట్టి శ్రీనివాసరావు, పూనూరి దేవదానం, మూలం ఓబుల్‌రెడ్డి, గోపు శ్రీనివాసరెడ్డి, ఆలూరి ఇసాక్, ఎర్రారెడ్డి, రాజా, కోటయ్య, ఆంజనేయులు, రామాంజి, బొజ్జ సంజీవ్ పాల్గొన్నారు.

ఘనంగా ఆయుర్వేద దినోత్సవం



ఆయుర్వేదం గురించి వివరిస్తున్న జీవీ రత్నం

దర్శి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఆయుర్వేద దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ప్రభుదాస్ హాజరై మాట్లాడుతూ ఆయుర్వేదం చాలా ప్రాచీన మైన వైద్యమని, ప్రకృతిలో మన ఇళ్ల చుట్టూ ఉండే అనేక ఆయుర్వేద మొక్కలతో రకరకాల ప్రయోజనాలు ఉంటాయని చెప్పారు. వాటిని గుర్తించి వైద్యంలో వాడుకుంటే అద్భుత ఫలితాలు ఉంటాయన్నారు. కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యుడు జీవీ రత్నం ఆయుర్వేద వైద్యం గురించి చారిత్రక విషయాలు వివరించారు. నేల ఉసిరి, గంగవయాలూరు ఆకు, తులసి ఆకుతో ఉపయోగాలు వివరించారు. తెలుగు ఆధ్యాపకులు డాక్టర్ గంధం వేణు, ఆంగ్ల ఆధ్యాపకులు డాక్టర్ నగేష్, కామర్స్ ఆధ్యాపకులు బి.శౌరీలమ్మ, వై.వెంకట రమణ, సహ ఆధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంగా ఉండాలి



డ్రాయింగ్ ప్రదర్శనను పరిశీలిస్తున్న అధికారులు

దర్శి: స్వస్థ నారి స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని యూపీహెచ్‌సీ మెడికల్ అధికారి ఎం.కాశీచేతన్, గైనకాలజిస్ట్ లక్ష్మీపూజిత అన్నారు. దర్శి ప్రైమరీ అర్బన్ హెల్త్ సెంటర్‌లో మంగళవారం మెడికల్ క్యాంప్ నిర్వహించారు. క్యాన్సర్ వంటి రోగాలకు సంబంధించిన డ్రాయింగ్‌ల ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళ ఆరోగ్యంగా ఉంటే ఆ కుటుంబం మొత్తం బలమైన సమాజంగా నిర్మితమవుతుందని చెప్పారు. క్యాంపులో క్యాన్సర్ పరీక్షలు, పౌష్టికాహారం, హెల్త్ ఎడ్యుకేషన్, మెరుగైన వైద్య సేవలు అందించి కుటుంబాలను స్వశక్తిగా బలోపేతం చేయడమే లక్ష్యమన్నారు. కమిషనర్ మహేష్, వైద్యాధికారులు లక్ష్మీపూజిత, రఫీ, డెంటిస్ట్ ప్రశాంతి, పరిమళ, మలేరియా సబ్ యూనిట్ అధికారి బసవారెడ్డి, సూపర్‌వైజర్ సుభాషిణి పాల్గొన్నారు.

పేదల పురోగతి లక్ష్యంగా పనిచేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో అజితకుమారి

తాళ్లూరు: ప్రతి ఒక్కరూ పేదల పురోగతి లక్ష్యంగా పనిచేయాలని ఎంపీడీవోగా బాధ్యతలు తీసుకున్న పి.అజితకుమారి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం సచివాలయ సిబ్బందికి పి–4 సర్వేపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో సంపన్నులైన ప్రతి ఒక్కరూ ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి సహాయ సహకారాలు అందించాలని అవగాహన కల్పించారు. డిప్యూటీ ఎంపీడీఓ డి.నాగమల్లేశ్వరి, ఏవో ఎస్.సత్యం, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



వివిధ అలంకరణల్లో ముస్తాబైన అమ్మవార్లు

జగజ్జననికి భక్త నీరాజనం

పెద్దదోర్నాల: దసరా నవరాత్రులు పట్టణంలో అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో ఆశ్వీయుజ శుద్ధ విధియ నాడు మంగళవారం పలు దేవాలయాల్లో అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. జగజ్జననిని దర్శించుకున్న భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. మండల కేంద్రంలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో వాసవీ మాత అమ్మవారి మూలవిరాట్‌కు తెల్లవారు జామున క్షీరాభిషేకం, కుంకుమార్చనలు నిర్వహించారు. అమ్మవారికి ఆలయ అర్చకులు బిదరె రాంప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో మహాన్యాస పూర్వక ఏక రుద్రాభిషేకం, చండీపారాయణం నిర్వహించారు. ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో అమ్మవారికి శ్రీలలితా సహస్రనామ పారాయణం నిర్వహించారు. వాసవీ అమ్మవారు గాయత్రీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక పోలేరమ్మ ఆలయంలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. నవరాత్రులను పురస్కరించుకుని ఆలయంలో వెలసిన అమ్మవారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో అమ్మవారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు కొండవీటి సుదర్శనాచార్యులు అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అభిషేకాలు నిర్వహించారు.

దర్శి: విజయదశమి పండగను పురస్కరించుకుని దర్శిలో దేవీ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. అమ్మవార్లను పూలమాలలతో అందంగా అలంకరించారు. మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం చేశారు. కనకదుర్గమ్మ తల్లి ఆలయంలో శ్రీ కాత్యాయనీదేవిగా దర్శనం ఇచ్చారు. కుంకుమ పూజా, అష్టోత్తర శత నామావళి పూజా కార్యక్రమాలు చేశారు. పోలేరమ్మ ఆలయంలో అమ్మవారు శ్రీవేద గాయత్రీ దేవిగా దర్శనం ఇచ్చారు. అమ్మవారిని పూలమాలలతో అందంగా అలంకరించారు. ఆలయంలో హోమం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కొబ్బరికాయలు కొట్టి మొక్కలు తీర్చుకున్నారు. దద్దాలమ్మ ఆలయంలో అమ్మవారు వేద గాయత్రీదేవిగా దర్శనం ఇచ్చారు. అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, ప్రత్యేక పూజలు చేశారు. వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు బాలత్రిపుర సుందరీదేవిగా దర్శనం ఇచ్చారు.

పెద్దారవీడు: విజయదశమి శరన్నవరాత్రి వేడుకలను పురస్కరించుకొని మండలంలోని రాజంపల్లెలో వెలసిన గొర్రాలికొండ తిరుమలనాథస్వామి ఆలయంలో రాజ్యలక్ష్మి అమ్మవారు క్షీరసాగరకన్య అలంకరణలో భక్తులకు మంగళవారం దర్శనమిచ్చారు. అర్చకులు భవానీప్రసాద్, కృష్ణమూర్తి ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతం, అభిషేకాలు, కుంకుమ పూజలు, కలశ పూజలు నిర్వహించారు. అమ్మవారికి పట్టువస్త్రాలు, ఆభరణాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వేదగాయత్రిగా ఈశ్వరి మహాదేవి

దొనకొండ: దసరా ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు మంగళవారం స్థానిక ఆనంద ఆశ్రమంలో వేద గాయత్రిగా ఈశ్వరి మహాదేవి దర్శనమిచ్చారు. ఉదయం 7 గంటల నుంచి గణపతిపూజ, అమృత అభిషేకం చేసి వేద గాయత్రిగా అమ్మవారిని అలంకరణ చేశారు. పూజారి మణిబాబు శర్మ కలశ పూజ, అష్టోత్తర శతనామావళి, కుంకుమార్చనలు చేసి మహా నైవేద్యం సమర్పించారు. బుధవారం లలితాదేవిగా ఈశ్వరీదేవి దర్శనమిస్తుందని భైరవానంద స్వామి తెలిపారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. దొనకొండకు చెందిన మాడిశెట్టి వెంకటేశ్వర్లు, దుర్గాభవాని దంపతులు అల్పాహారం ఏర్పాటు చేశారు.

పుల్లలచెరువు: మండలంలోని ముటుకులలో వేంచేసి ఉన్న శ్రీ రేణుక ఎల్లమ్మ దేవస్థానంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం రెండో రోజు కార్యక్రమంలో భాగంగా అమ్మవారు గాయిత్రీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ పూజారి భరద్వాజ శాస్త్రి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. మండలంలోని పలు ఆలయాల్లో దేవి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు.

త్రిపురాంతకం: శ్రీబాలాత్రిపుర సుందరీదేవి, శ్రీపార్వతి త్రిపురాంతకేశ్వరస్వామి వారి ఆలయాల్లో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. త్రిపురాంతకంలోని ఆలయాల్లో అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చనలు, ఉభయదాతలు పూజలు నిర్వహించారు. బాలాత్రిపురసుందరీదేవి ఆలయంలో గోపూజ, బాలపూజ చేశారు. స్వామి వారి ఉత్సవ మూర్తుల ఊరేగింపు ఆలయ ప్రాంగణంలో వైభవంగా జరిగింది.

కురిచేడు: దేవి శరన్నవరాత్రుల్లో భాగంగా రెండో రోజు మంగళవారం శ్రీజ్ఞానప్రసూనాంబ దేవి భక్తులకు కామాక్షిదేవిగా దర్శనమిచ్చింది. భక్తులతో ఆలయ పూజారి కురిచేటి సుబ్బారావు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు వితరణ చేశారు.

ఎంపీడీఓల బాధ్యతల స్వీకరణ



సత్యప్రసాద్



పి.అజితకుమారి



పి.కల్పన

కురిచేడు: మండల అభివృద్ధి అధికారిగా పి.సత్యప్రసాద్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఎంపీడీఓగా బాధ్యతలు నిర్వహించిన విజయశేఖర్‌కు రాష్ట్ర స్వచ్ఛ భారత్ మేనేజర్‌గా పదోన్నతి రావడంతో ఎంపీడీఓ పోస్టుకు ఖాళీ ఏర్పడింది. ఆ తర్వాత డిప్యూటీ ఎంపీడీఓలు సతీష్‌బాబు, కేజీఎస్ రాజు ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహించారు. ఇటీవల జరిగిన పదోన్నతుల్లో భాగంగా పల్నాడు జిల్లా దుర్గి మండల డిప్యూటీ మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా పనిచేస్తున్న సత్యప్రసాద్ మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా పదోన్నతి పొంది కురిచేడు మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా బాధ్యతలు స్వీకరించారు.

తాళ్లూరు ఎంపీడీవో కూడా..

తాళ్లూరు: ఎంపీడీవోగా పి.అజితకుమారి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. చీమకుర్తిలో ఈవోఆర్డీగా విధులు నిర్వహిస్తున్న ఆమె పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జి ఎంపీడీవోగా విధులు నిర్వహించిన ఎస్.సత్యం పదోన్నతిపై కొమరోలు ఎంపీడీవోగా వెళ్లనున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో మండలాభివృద్ధికి పాటుపడతామని చెప్పారు.

దర్శి ఎంపీడీఓగా కల్పన..

దర్శి: ఎంపీడీఓగా పి.కల్పన మంగళవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో డిప్యూటీ ఎంపీడీఓగా పని చేస్తూ పదోన్నతి పొంది బదిలీపై ఎంపీడీఓగా దర్శికి వచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అందరికీ అందేందుకు కృషి చేస్తామన్నారు. ప్రజలు నేరుగా తనను కలిసి పనులు చేయించుకోవచ్చని ఆమె స్పష్టం చేశారు.

108లో గర్భిణి సుఖ ప్రసవం



క్షేమంగా ఉన్న తల్లి, బిడ్డ

దొనకొండ: మండలంలోని పోలేపల్లి ఎస్సీ కాలనీకి చెందిన మురికిపూడి నాగలక్ష్మి అనే మహిళ పురిటి నొప్పులతో ప్రసవ వేదన పడుతుండటంతో కుటుంబ సభ్యులు సోమవారం అర్ధ రాత్రి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న త్రిపురాంతకం 108 అంబులెన్స్ సిబ్బంది పోలేపల్లి ఎస్సీ కాలనీకి వెళ్లి గర్భిణికి ప్రథమ చికిత్స నిర్వహించుకుంటూ మార్కాపురం ప్రాథమిక వైద్యశాలకు తీసుకెళ్తున్నారు. మార్గమధ్యంలోని బోడపాడు వద్ద నొప్పులు అధికం కావడంతో అంబులెన్స్‌ను పక్కన ఆపి బంధువుల అనుమతితో ఈఎంటీ డెలివరీ కండక్ట్ చేశారు. నాగలక్ష్మి పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నారని సిబ్బంది వై.మార్క్, డి.శ్రీను తెలిపారు. బంధువులు సిబ్బందిని అభినందించారు.

డిగ్రీ కళాశాలల బంద్ కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలతో కళాశాల అధ్యాపకులు

దొనకొండ: ప్రైవేటు డిగ్రీ కాలేజీల బంద్‌కు సంబంధించిన కరపత్రాలను స్థానిక గౌతమి డిగ్రీ కళాశాలలో మంగళవారం ప్రిన్సిపాల్ నాని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఫీజుల ఆలస్యానికి కారణంగా కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించలేకపోతున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సహకరించాలని నాని కోరారు. అధ్యాపకులు దేవదానం, దుగ్గెంపూడి వెంకటేశ్వరరెడ్డి, దాసరి విక్టోరియా పాల్గొన్నారు.

ఇంటర్న్‌షిప్‌పై విద్యార్థులకు అవగాహన

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఒకేషనల్ విద్యార్థులు ఈ నెల 22వ తేదీ నుంచి అక్టోబర్ 1వ తేదీ వరకు ఒకేషనల్ ఎడ్యుకేషన్ ఇంటర్న్‌షిప్ కార్యక్రమంలో పాల్గొననున్నట్లు ట్రైనర్ సయ్యద్ నాయబ్ రసూల్ తెలిపారు. మండల కేంద్రంలోని సచివాలయంలో ఇంటర్న్‌షిప్, ఆన్‌లైన్ సెంటర్, డిజిటల్ వర్క్, ఫొటో షాప్, ఫ్లెక్సీ ప్రింటింగ్, మీ సేవా, ఎలక్ట్రానిక్ సేల్, సర్వీస్ షాపులపై అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శ్యాంప్రసన్నతాంజలి, మురళి, నరేష్, కార్తీక్ పాల్గొన్నారు.